

గజ్వేల్ : కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బొప్పాపూర్ సర్పంచ్ బాలమణీమల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

# కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

దుబ్బాక, డిసెంబర్ 4 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగుతున్నది. సోమవారం దుబ్బాక మండలం పోతారం గ్రామంలో ఎమ్మెల్యేను కలిసేందుకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ పుష్పలతా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభాకరన్న గెలుపుకోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**గజ్వేల్..**

గజ్వేల్, డిసెంబర్ 4 : దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజ్ఞాపూర్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు, కరుణాకర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్, నాయకులు ఉన్నారు.

**కొండపాక..**

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 4 : దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు కోల సద్గుణారవీందర్ కలిశారు. మండలంలోని పోతారంలో ఆయన స్వగృహంలో కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు మల్లేశం, ప్రదీప్‌యాదవ్, రాము, మహిపాల్ తదితరులు ఉన్నారు.



దుబ్బాక : కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి దంపతులు



కొండపాక : కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కోల సద్గుణారవీందర్

### ఆరోగ్యం ఎలా ఉంది సార్..

గజ్వేల్, డిసెంబర్ 4: ఆరోగ్యం ఎలా ఉంది సార్.. ప్రభుత్వం రాలేదని బాధపడొద్దు.. అప్పుడప్పుడు మా మార్కెట్ వద్దకు వచ్చి వెళ్లాలని పాతూర్ మార్కెట్ వద్ద మహిళా రైతులు కోరారు. సోమవారం పాతూర్ మార్కెట్ వద్ద కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉన్న విషయాన్ని గమనించిన మహిళా రైతులు అక్కడికి వచ్చి ఆరోగ్యం ఎలా ఉంది సార్ అని ఆప్యాయంగా పలకరించారు. వారి ప్రేమకు ముగ్ధుడైన ప్రభాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలుపుతూ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



పాతూర్ మార్కెట్ వద్ద కొత్త ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న మహిళా రైతులు

## ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న ఎంపీటీసీ నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, డిసెంబర్ 4 : సార్వత్రిక ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఎంపీటీసీ సుతారి నర్సింహులు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాములు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లయ్య, రాజాగౌడ్, నాగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకమిటీ చైర్మన్ పదవికి రాజీనామా

జగదేవ్‌పూర్, డిసెంబర్ 4 : ప్రజా తీర్పును గౌరవిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్పించిన ఆత్మకమిటీ చైర్మన్ పదవికి గుండా రంగారెడ్డి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్, హరీశ్‌రావు తనకు నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవితో పార్టీ శ్రేణులు, రైతులతో మమేకమయ్యే అవకాశం వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉంటామన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 4 : దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్నగారి శంకర్ కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో 'దళిత మార్చ్ టూ పార్లమెంట్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో భారత రాజ్యాంగం స్థానంలో అధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఎత్తివేయాలని చూస్తున్నదని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలనే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఏడబ్ల్యూ జాతీయ నాయకులు మట్టగల్ల వెంకటయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, టీవీవీయూ నాయకుడు నర్సింహ పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

గజ్వేల్, డిసెంబర్ 4 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్ పటేల్ సూచించారు. సోమవారం గజ్వేల్‌లో జగదేవ్‌పూర్ మోడల్ పాఠశాల విద్యార్థులకు హైదర్ పటేల్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నందున వారికి దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు నరేశ్, నవీన్, అనంతరాములుచారి, గోవర్ధన్‌రెడ్డి, విజయరేఖ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, డిసెంబర్ 4 : హుస్నాబాద్ పట్టణ శివారులోని సిద్దిపేట రోడ్డులో గల ఎల్లమ్మ వాగులో టిప్పర్లతో మొరం, నల్లమట్టిని పోసి కొందరు ఆక్రమించుకుంటున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ రెవెన్యూ అధికారులను కోరారు. సోమవారం సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎల్లమ్మ వాగును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగుకు ఇరువైపులా నల్లమట్టి పోసి చదును చేసి అందులో వ్యవసాయ పనులు చేస్తున్నారని తెలిపారు. దీంతో వాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎల్లమ్మ చెరువు జోరుగా మత్తడి దుంకితే వరద ఉధృతి పెరిగి వాగుపై నిర్మించిన వంతెనతో పాటు మూడు చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయే అవకాశం ఉందన్నారు. వెంటనే తహసీల్దార్ స్పందించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## గీత కార్మికుడికి తీవ్రగాయాలు

చేర్యాల, డిసెంబర్ 4 : తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని తాడూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. తాడూరు గ్రామానికి చెందిన వడ్లకొండ రంగయ్య రోజు మాదిరిగా తాటి వనంలోకి వెళ్లి తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాధితుడిని సిద్దిపేట దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

## 'పల్లా'కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 4 : జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సోమవారం ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ అభివృద్ధికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉపసర్పంచ్ లింగం, నాయకులు గూడ శంకర్‌రెడ్డి, తాళ్లపల్లి కనకయ్య, తుమ్మగోపి, శిరబోయిన తిరుపతి, గెంటె శివ, కూనబోయిన లింగం, యాదగిరి ఉన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ప్రజల గుండెల్లో నిలిచిపోయే వ్యక్తి కేసీఆర్

వర్గల్, డిసెంబర్ 4 : ఓడినా.. గెలిచినా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయే ఏకైక వ్యక్తి కేసీఆర్ అని బీఆర్‌ఎస్ మండల నాయకులు వేలూరి వెంకట్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాశం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్గల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు అండగా ఉంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద పటాకులు కాల్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్గల్ : కేసీఆర్ గెలుపు సందర్భంగా పటాకులు కాల్చుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో సీపీఐ కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంద పవన్

హుస్నాబాద్, డిసెంబర్ 4 : కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోపాటు ప్రభుత్వ ఏర్పాటులో సీపీఐ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారని, సీపీఐ బలం ఏమిటో మరోసారి రుజువు చేశారన్నారు. హుస్నాబాద్‌లో పొన్నం ప్రభాకర్‌ను గెలిపించడంతోపాటు కొత్తగూడెం స్థానాన్ని సీపీఐ గెలుచుకోవడం హర్షనీయమన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసే సీపీఐని ప్రజలు గుర్తించారన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు మల్లేశ్, లక్ష్మారెడ్డి, గోపి, సత్యనారాయణ, సృజన్‌కుమార్, వనేశ్, పద్మ, కొమురయ్య, జనార్దన్, సుదర్శనాచారి, కుమారస్వామి పాల్గొన్నారు.